మల్లేష్ క్లీన్‌చంద్‌కు సత్కారం



అబిడ్స్: ఏషియన్ యూనివర్సిటీలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయం సాధించిన కె.మల్లేష్ క్లీన్‌చందన్‌ను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గురువారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో సిల్వర్ మెడల్ సాధించిన మల్లేష్ క్లీన్‌చందన్ కేటీఆర్ ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ హయాంలోనే క్రీడాకారుల సంక్షేమం కొనసాగిందన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

గన్‌ఫౌండ్రీ: ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా చేపట్టిన సందర్భంగా భారత సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ రికవరి ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) ఆధ్వర్యంలో గురువారం తిరంగా యాత్ర నిర్వహించారు. అబిడ్స్‌లోని ట్రిబ్యునల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఎంజే మార్కెట్, అబిడ్స్, గన్‌ఫౌండ్రీ, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీఆర్‌టీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి టి. శ్రీధర్‌రెడ్డి, మౌనిక, ఎ.పవన్‌కుమార్ యాదవ్, చక్రాల శ్రీనివాస్, ఎస్.అశోక్ కుమార్, ఆర్.శ్రవణ్‌కుమార్, సీహెచ్ కిశోర్, ఎ.విజయ్‌కుమార్, సి.శ్రీధర్ పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవల్లో భాగంగా గురువారం దేవి భూదేవి సమేత కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణంలో దంపతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి శేషాచారి మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగిందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ బట్టా చార్యులు, బద్రీనాథ్, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



ఖాజిపురాలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు నిండి రోడ్లపై పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని ఖాజిపురా ప్రాంతంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు, చిన్నారులు, వృద్ధులు దుర్వాసన, దుర్గంధంతో పదరాని పాట్లు పడుతున్నారు. ఈ డ్రైనేజీ సమస్య కారణంగా తమ పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ప్రతి వారం కూరగాయల సంత కొనసాగుతుందని..ఈ డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో తాము వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ మట్టిలో పుట్టిన మహనీయుల్లో భాగ్యరెడ్డి వర్మ ఒకరని పలువురు ప్రముఖులు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు వెన్నెల గద్దర్ మాట్లాడుతూ..ఒకప్పుడు మాదరి బాగయ్యగా ఉన్న పేరు భాగ్యరెడ్డి వర్మగా ఎలా రూపాంతరం చెందిందో వారి చరిత్ర చదివితే అర్థమవుతుందన్నారు. అనంతరం ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్‌కు భాగ్యరెడ్డి వర్మ స్మారక జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంట చక్రపాణి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ అమూలక్ శాస్త్రీ, మేనేజింగ్ ట్రస్టీ బి.ఎస్.జ్ఞాన ప్రకాష్ పాల్గొన్నారు.

జై హనుమాన్



పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తమలపాకు పూజ

- భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి
- పోటెత్తిన భక్తులు
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

గోల్కొండ: హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. షేక్‌పేట్‌లోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గోల్కొండ రిసాలబజార్‌లోని హనుమాన్ ఆలయంలో మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు.

పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన...

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి ప్రాంతంలోని భవానీ శంకర ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో గురువారం 21 అడుగుల పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా సర్వధర్మ సనాతన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. శ్రీమతం నరసింహాచార్య కాకునూరి రవి నారాయణ శర్మ, శ్రీ కృష్ణమాచార్యుల పర్యవేక్షణలో స్వామి వారికి వాయుస్తుతి పునశ్చరణతో అభిషేకం, 108 కలశాలతో పంచముఖ ఆంజనేయ స్వామి వారికి కుంభాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.వెంకటేష్‌లకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అధ్యక్షుడు మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజు ముదిరాజ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



గోల్కొండ రిసాల బజార్‌లో పూజల్లో సాయిబాబాచారి తదితరులు

ఘనంగా తమలపాకు పూజ..

హనుమాన్ జయంతి సందర్భంగా లాల్‌దర్వాజా పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సంకట మోచన హనుమాన్ స్వామికి అభిషేకం, తమలపాకు పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి లెనిన్‌బాబు దంపతులు, ట్రస్టీ వెంకటేశ్వర రావు, ప్రధాన అర్చకులు మోహనాచార్యులుతో పాటు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోషామహల్‌లో..

అబిడ్స్: హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా పాల్గొని పూజలు చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గోషామహల్, జాంబాగ్, ఆగాపురా, ఆసిఫ్‌నగర్, బేగంబజార్, ధూల్‌పేట్ తదితర ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



షేక్‌పేట్‌లో హనుమాన్ జయంతి పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపనలో వెంకటేష్ తదితరులు



వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, గంగానగర్ నాలా, మదీనానగర్, ధోబీ ఘాట్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయన్నారు. కొన్ని నెలలుగా గంగానగర్ నాలా విస్తరణ, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు నత్త నడకన సాగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలకు వరద నీటి సమస్యలు రాకుండా ఎస్ఆర్టీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

అలరించిన దేశభక్తి గీతాలాపన



జాతీయ జెండాలతో పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో జైహింద్ ఇండియన్ ఆర్మీ (ఆపరేషన్ సిందూర్) పేరిట నిర్వహించిన దేశభక్తి గీతాలాపన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు. అంతకు ముందు పలువురు గాయనీ గాయకుల గీతాలాపనతో ప్రాంగణమంతా జైహింద్ నినాదాలతో దద్దరిల్లి పోయింది. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, దళిత జాతీయ నాయకులు జె.బి.రాజు, శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆహార పదార్థాల పంపిణీ అభినందనీయం

చార్మినార్: మగశిర కార్తె సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8న నిర్వహించనున్న చేపప్రసాదం కోసం వచ్చే ప్రజలకు ఒకరోజు ముందుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయనున్నామని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు. గురువారం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్లపై తమ ప్రతినిధులతో చర్చించామన్నారు. 25 ఏళ్లుగా నిరంతరం చేప ప్రసాదం కోసం వచ్చే దూర ప్రాంతాల ప్రజలకు నాగ్‌నాథ్ మాశెట్టి ఆహార పదార్థాలు అందజేయడం అభినందనీయమని శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప అన్నారు. గురువారం ఆయనకు బొకే అందజేసి శాలువా కప్పి అభినందించారు.



నాగ్‌నాథ్ మాశెట్టిని అభినందిస్తున్న మల్లికార్జునప్ప

ఆశా కార్యకర్తలకు యూనిఫామ్‌లు అందజేయాలి



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుల్తాన్‌బజార్: తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ అందజేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కోఠిలోని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్‌తో ఆశాలు కాలం గడుపుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఈ విషయంపై స్పందించి వెంటనే యూనిఫామ్ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆశా సంఘం రాష్ట్ర నాయకత్వంలో మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 15 రోజుల్లో యూనిఫామ్స్ అందేలా చూస్తానని జాయింట్ డైరెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.సంతోషి, ప్రధాన కార్యదర్శి మంజుల, ఎస్.రేణుక, వాణి, ఎ.స్వరూప, కె.భవాని, నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం



గోపాల్‌సింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జియాగూడ: ప్రజా సేవకే జీవితం అంకితమని ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ ఆలయ కమిటీ కోశాధికారి గోపాల్‌సింగ్ పేర్కొన్నారు. నిరంతరం సమాజ సేవలు చేపడుతూ పేద బడుగు వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేస్తానన్నారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్, ఇతర నాయకులు ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్ సింగ్ మాట్లాడుతూ..సమాజంలో పేద బడుగు వర్గాల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడే ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బద్రినాథ్ సింగ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి రెండు గేదెలు మృతి

గౌలిపురా: భారీ వర్షానికి పురాతన గోడ కూలి రెండు గేదెలు మృతి చెందిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సయ్యద్ షఫి ఉల్లా హుస్సేనీ సహారా డైరీ ఫామ్‌ను నిర్వహిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పురాతన డైరీఫామ్ గోడలు కూలి అందులో గేదెలపై పడటంతో రెండు గేదెలు మృతి చెందాడు. రెండు చిన్న గేదెలకు గాయాలయ్యాయి. దీనిపై యజమాని సయ్యద్ షఫి ఉల్లా హుస్సేనీ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



రాధాకృష్ణ

సంతోష్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రక్షాపురం ప్రాంతానికి చెందిన వి.వెంకటేశ్వర్లు కుమారుడు రాధాకృష్ణ (54) కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు రాధాకృష్ణ ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేరస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లోని స్థానికులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో మీరు ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించానన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి తాను కృషి చేస్తున్నానని అందులో భాగంగానే తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నానన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నానన్నారు. ఈ సమీక్ష కార్యక్రమంలో సమస్యలు సంబంధిత అధికారులకు తెలిపి వెంటనే వాటిని పరిష్కరింపజేస్తున్నానన్నారు. ఏదేమైనా మజ్లిస్ పార్టీ ప్రజల వెంటే ఉండే పార్టీ అని అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, అమీరుద్దీన్, హారూన్‌ఫరాన్, వజీఉజ్ జమా తదితరులున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

ఫుట్‌పాత్ కబ్జాలపై ఉక్కుపాదం



ఆసిఫ్‌నగర్‌లో ఫుట్‌పాత్ కబ్జాలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నూనె మిల్లు చౌరస్తా నుంచి జిర్రా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ కబ్జాలను గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి తొలగించారు. అకస్మాత్తుగా జేసీబీలను తీసుకువచ్చి తమ దుకాణాల ముందు షెడ్డులను కూలివేస్తున్నారని దుకాణాదారులు జీహెచ్‌ఎంసీ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చడంతో తాము నష్టపోయామని దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారి టి.సునీతను వివరణ కోరగా షాపు ముందు షెడ్డులు వేసుకొని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసేవారికి మూడు రోజుల క్రితమే సమాచారం ఇచ్చామని తెలిపారు. చంద్రభవన్ చౌరస్తా వద్ద కూల్చివేతల సమయంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఎస్ఐలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

గోల్కొండ: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలని రిసాలబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ అన్నారు. గురువారం పాఠశాలలో గోల్కొండ, ఖైరతాబాద్, షేక్‌పేట్ మండలాలకు చెందిన ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ కెపాసిటి బిల్డింగ్ ట్రెనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల్లోని సృజనాత్మకత ప్రతిభను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలని ఆమె అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల బోధన స్థాయిని పెంచి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సరికొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ కార్యాలయ సిబ్బంది జాకేర్, ఆర్.రేహాన్‌తో పాటు వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ

పూల్ డ్రైవ్‌తో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు

అఫ్జల్‌గంజ్: పూల్ డ్రైవ్ ప్లేస్‌మెంట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తుగా మారిందని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎస్.చలమా రెడ్డి, కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఐటీ దిగ్గజ కంపెనీ టెక్ మహీంద్రా పూల్ డ్రైవ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. కళాశాలకు చెందిన పలు సంవత్సరాల ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ పూల్ డ్రైవ్‌లో తమ భవిష్యత్తును ఎంచుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ చలపతి రావు, కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ..తమ కళాశాలలో చదివిన విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం ఇలాంటి పూల్ డ్రైవ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్ ఆకుల మాట్లాడుతూ..జాతీయ స్థాయిలోనే ఐటీ దిగ్గజ కంపెనీ టెక్ మహీంద్రా తమ కళాశాలలో పూల్ డ్రైవ్ నిర్వహించి ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెదలవాడ లక్ష్మీనాథ్, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలి

అబిడ్స్: ఉద్యోగుల డిపార్ట్‌మెంటల్‌కు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కేఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కర్, కార్యదర్శి మహ్మద్ ఫక్రుద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లను వారు ఘనంగా సత్కరించి ఉద్యోగుల సమస్యలపై మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మిడ్డెమీల్స్ పోస్టులను, 10 అసిస్టెంట్ పోస్టులను, 10 సూపరింటెండెంట్, 10 సీనియర్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్‌కు పంపాలన్నారు. పాత పద్ధతి ప్రకారం అర్హులైన మినిస్టీరియల్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్లుగా, ఇతర పోస్టుల ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ, కె.వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, పవన్‌బాబు, అశోక్, రమేష్, సుదర్శన్, శ్రీనివాస్‌బాబు, దిలీప్‌కుమార్ యాదవ్, ఫిరోజ్, అరుణజ్యోతి, ముజాహీయుద్దీన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్

హిందూ ఏక్తా ర్యాలీలో పాతబస్తీ బీజేపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న టి.ఉమా మహేందర్, సురేందర్ తదితరులు

చార్మినార్: కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గురువారం నిర్వహించిన హిందూ ఏక్తా సామూహిక ర్యాలీలో పాతబస్తీకి చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమామహేందర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సురేందర్, కునాల్ రావు, ప్రశాంత్, ప్రకాష్, నటరాజ్, సుమన్, రింకు, విపిన్ తదితరులు గురువారం ఉదయం పాతబస్తీ నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. గురువారం హనుమాన్ జయంతి కావడంతో పాతబస్తీ బీజేపీ నాయకులు బండి సంజయ్‌కు హనుమంతుని మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా ఉమా మహేందర్ మాట్లాడుతూ..విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని అతలాకుతలం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. హిందూ సమాజమంతా ఏకమై ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273